ప్రజాశక్తి
సోమవారం 29 జూలై, 2024
5
శ్రీకాకుళం

విద్యా పథకాల పేర్లు మార్పు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్రం అధికారం చేపట్టిన టిడిపి కూటమి ప్రభుత్వం తమ హయాంలో విద్యాశాఖలో అమలవుతున్న పథకాల పేర్లు మార్పు చేస్తూ... ఉన్నత విద్యాశాఖాధికారులు ఆదేశాలు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న జగనన్న ఆమ్మఒడి పథకానికి తల్లికి వందనంగా మార్చారు. జగనన్న విద్యా కానుకని సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా, జగనన్న గోరుముద్దను డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా, మనబడి నాడు-నేడుని మనబడి - మనభవిష్యత్‌గా, స్వేచ్ఛను బాలికారక్షగా, జగనన్న ఆణిముత్యాల్ని అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారంగా మార్చుతూ ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం పేర్లు ఆదివారం నుంచి అమలులోకి రానున్నాయి.

ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో అసంపూర్తిగా ఉన్న గృహాలు

గృహ నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో!

- భారంగా మారిన ఇళ్ల నిర్మాణ వ్యయం
- గృహ నిర్మాణాల అసంపూర్తికి అదే కారణం
- ప్రతివంద రోజులకు లక్ష్యాలు నిర్దేశం
- సాయం పెంపుపై లబ్ధిదారుల్లో ఆశలు

జగనన్న ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం జిల్లాలో వేలాది మంది అర్హులైన పేదలకు గృహాలను మంజూరు చేసింది. గతేడాది అక్టోబరులో వారిలో కొంతమందితో సామూహిక గృహ ప్రవేశాలూ చేయించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మరోసారి అటువంటి కార్యక్రమం నిర్వహించి మరికొంతమందితో గృహ ప్రవేశాలు చేయించాలని భావించింది. ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి కాకపోవడం, ఇంతలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో ఆ ప్రయత్నం నెరవేరలేదు. జిల్లాకు కేటాయించిన ఇళ్లలో ఇప్పటికే వేలాది ఇళ్లు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. వీటిని పూర్తి చేయడంపై టిడిపి కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. ప్రతి వంద రోజులకు లక్ష్యాలను నిర్దేశించి వాటిని పూర్తి చేసేలా కార్యాచరణ మొదలుపెట్టింది. ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడానికి నిర్మాణ వ్యయం భారంగా మారడమే ప్రధాన కారణమన్న అభిప్రాయం వినిపిస్తోంది. సాయం పెంపుపై గతంలో పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు (ఎన్‌పిఐ) పథకంలో భాగంగా 69,748 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 1546 ఇళ్లు ప్రారంభం కాలేదు. వీటిలో బిబిఎల్ (బిలో బేస్‌మెంట్ లెవల్) దశలో 13,747 ఇళ్లు, పునాది దశలో 8,386, పైకప్పు దశలో 4,829 ఇళ్లు ఉన్నాయి. శ్లాబ్ పూర్తయినవి 4,502 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు మొత్తం 35,259 ఇళ్లు పూర్తయ్యాయి. జిల్లాలో ప్రారంభం కాని ఇళ్లను మినహాయిస్తే ఇంకా 32,943 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉంది. వీటిలో త్వరితగతిన పూర్తయ్యే అవకాశం ఉన్న 24,067 ఇళ్లను మొదటి వంద రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. అందుకనుగుణంగా మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. ఇవికాక ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ కింద జిల్లాకు నిర్దేశించిన గృహ లక్ష్యాలను పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించారు. పిఎంఎవై గ్రామీణ్ కింద జిల్లాకు 6,409 ఇళ్లను నిర్మించాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు 1852 ఇళ్లు పూర్తయ్యాయి. మరో 1905 ఇళ్లను వచ్చే వంద రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

లబ్ధిదారుల ఇబ్బందులను పరిష్కరిస్తేనే...

గృహ నిర్మాణాలకు వంద రోజుల లక్ష్యం నిర్ణయించినా, లబ్ధిదారుల ఇబ్బందులను పరిష్కరించకుండా అది సాధ్యం కాదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం భారంగా మారడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుకతో పాటు ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న సాయం కంటే మరో రెండింతలు ఖర్చు చేయాల్సి రావడంతో చాలామంది వెనక్కి తగ్గుతున్నారు. అప్పులు చేసి ఇళ్లు కట్టేందుకు ఇష్టపడడం లేదు. ఇళ్ల పట్టాలు దక్కడం ఒక ఆస్తిగానే అత్యధిక మంది భావిస్తున్నారు తప్ప ఇళ్లు నిర్మించుకుని అక్కడకు తరలివెళ్లేందుకు ఆసక్తి కనబరచడం లేదు. స్థానికంగా చిన్న చిన్న వ్యాపారాలు, పలురకాల వృత్తులు చేసుకుంటున్న వారు కాలనీలకు తరలివెళ్తే అక్కడ ఏం పనులు, వ్యాపారం జరుగుతాయంటూ నిరాసక్తత కనబరుస్తున్నారు. ఫలితంగా మూడేళ్ల కిందట ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైనా, నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. జిల్లాలో 35 వేల వరకు గృహాలు పూర్తయ్యాయంటే ఇందులో అధికారుల కృషి చాలా వరకు ఉంది. లబ్ధిదారులను ఒప్పించో, ఇళ్లు కట్టపోతే పట్టాలు తీసుకుంటామని బెదిరించో ఏదోవిధంగా ఆమేరకు పూర్తి చేయగలిగారు.

అర్బన్‌లోనూ అవే పరిస్థితులు

గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పట్టణ ప్రాంతాలకు దూరంగా లేఅవుట్లలో ప్లాట్లను ఇవ్వడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం లబ్ధిదారులు ఉంటున్న నివాస ప్రాంతం నుంచి అక్కడికి వెళ్లడానికి ఎవరూ సిద్ధపడడం లేదు. ప్రస్తుత నివాస ప్రాంతాల్లోనే చిన్నపాటి వ్యాపారాలు, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తాము అక్కడికి తరలివెళ్తే ఉపాధి పోతుందన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. ఇళ్ల నిర్మాణం ఆర్థికంగా భారంగా మారడం, ఇళ్లు మారడానికి ఇష్టపడని వారు అప్పులు చేసి ఇళ్లను నిర్మించేందుకు అయిష్టత కనబరుస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తులసీదాస్

కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పిలుపునిచ్చారు. నగరంలోని ఇందిరానగర్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శవర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం ప్లీనం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందన్నారు. మాటలకు అనుగుణంగా చేతలు శూన్యం అన్నట్లుగా ఉందన్నారు. ఎన్నికల అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడైనా న్యాయం జరుగుతుందని, భారీగా నిధులు వస్తాయని, విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే ఎదురైందన్నారు. సంక్షోభంలో ఉన్న విశాఖ ఉక్కును ఆదుకోకపోగా, గతేడాది కన్నా రూ.63 కోట్లు తగ్గించారని అన్నారు. విశాఖ పోర్టుకు రూ.125 కోట్లు కోత పడిందన్నారు. రాష్ట్రంపై బిజెపి సవతి తల్లి ప్రేమకు ఇది నిదర్శనమని విమర్శించారు. రాష్ట్రం నుంచి ఎంపీగా ఎన్నికైన ఉక్కుగనుల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్థికమంత్రి ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పేరు పలుసార్లు ప్రస్తావించారు. కానీ, నిధులు కేటాయింపు నిరాశ కలిగించిందన్నారు. చెప్పిన మాటల్లో కూడా స్పష్టత లేదు. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజలను మోసగించడానికి కేంద్రం ప్రయత్నించిందన్నారు. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి చెప్పడంతో రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదని అన్నారు. రూ.15 వేల కోట్ల గ్రాంటుగా ప్రకటించాలన్నారు. వివిధ సంస్థల ద్వారా అప్పుగా ఇప్పించడం రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కేంద్రానికి అవగాహన ఉన్నా... బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విభజన హామీల అమలు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధుల ప్రస్తావన లేదని అన్నారు. ఆర్థిక మంత్రి ప్రస్తావించిన రెండు పారిశ్రామిక కారిడార్లకూ నిధులు గురించి ప్రస్తావించలేదన్నారు.

పోలవరానికి రూ.12 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా... బడ్జెట్‌లో కేటాయింపుల్లేవని ధ్వజమెత్తారు. నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేశారని విమర్శించారు. ప్రత్యేక హోదా ఊసే లేదన్నారు. రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదని పేర్కొన్నారు. పదేళ్ల నుంచి విభజన చట్ట ప్రకారం నిధులు కేటాయించకుండా బిజెపి నిర్లక్ష్యం చేసిందన్నారు. ఈ బడ్జెట్‌లోనూ ఆశించిన రీతిలో కేటాయింపులు లేవన్నారు. పుణ్యక్షేత్రాల టూరిజం వరద నివారణ చర్యలు తదితర విషయాల్లో అనేక రాష్ట్రాలకు నిధులు కేటాయించినా... తెలుగు రాష్ట్రాల ప్రస్తావనే లేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం బిజెపిపైన రాజకీయ ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో సిపిఎం నాయకులు కోనారి మోహనరావు, జి.సింహాచలం, కె.నాగమణి, పోలాకి ప్రసాదరావు, శిర్ల ప్రసాద్, పి.తేజేశ్వరరావు, నంబూరు షణ్ముఖరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకెళ్లాలి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ విజయ
- స్థాయీ సంఘ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకెళ్లాలని, రాజకీయాలకతీతంగా ప్రస్తుత ప్రభుత్వం తోడ్పాటు అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన ఆదివారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ముందుగా సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, ఎన్.ఈశ్వరరావులకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో పోలాకి మండలంలో తాగునీటి పథకాల నిర్వహణ, తీర ప్రాంత గ్రామాల్లో ఉప్పు నీటి సమస్యలను ఎమ్మెల్యే రమణమూర్తి ప్రస్తావించారు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో భారీ, మధ్యతరహా పరిశ్రమలు ఉన్నాయని, భూగర్భ జలాల కోసం ఈ కంపెనీల్లో బోర్లు వేస్తున్నారని, వాటిని అనుమతులు మంజూరులో నాలా నిబంధనలు ఎంత మేరకు పాటిస్తున్నారని ప్రశ్నించారు. ప్రధానంగా రణస్థలం మండలంలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వారికి ప్రత్యామ్నాయంగా ఆయా పరిశ్రమల నుంచి తాగునీరు అందించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. 1వ స్థాయీ సంఘం సమావేశంలో పాల్గొన్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన సమయంలో పంచాయతీరాజ్ శాఖలో ఉన్న పిఐయు, పిఇయు విభాగాలను విలీనం చేసి కార్యాలయాలన్ని అనకాపల్లికి మార్చారని అన్నారు. దీనివల్ల పంచాయతీరాజ్ శాఖ పనుల పర్యవేక్షణ, ఇతర అంశాలపై అధికారులతో చర్చించే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. తిరిగి ఈ డివిజన్లను యథాస్థితిలో శ్రీకాకుళంలో కొనసాగేందుకు ప్రభుత్వానికి లిఖిత పూర్వకంగా ప్రతిపాదన పంపాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలో గృహనిర్మాణ శాఖ మంజూరైన ఇళ్లను నిలిపివేతపై వివరణ ఇవ్వాలని సభ్యులు కోరారు. ముమ్మరంగా వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారని, ఈ సమయంలో ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో సిద్ధం చేయాలని పలువురు సభ్యులు కోరారు. డ్వామా పీడీ చిట్టిరాజు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ అమలు గురించి వివరిస్తూ... రాష్ట్రంలోనే ఉపాధి కల్పనలో జిల్లా మొదటి స్థానంలో ఉన్నట్టు తెలిపారు. వర్షాలు వల్ల ప్రస్తుతం పనులు తాత్కాలికంగా నిలుపుదల చేశామని, అయితే ప్రత్యామ్నాయంగా ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. రైతులకు ఉద్యాన పంటలపై అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 1,800 కిలో మీటర్ల కాలువలు పూడికలు తీయడంతో రైతులకు వ్యవసాయ పనులకు సకాలంలో సాగునీరు అందించామని అన్నారు. ఐదెకరాలు పొలం ఉన్న రైతులు ఉద్యాన పంటలపై దృష్టిసారించాలన్నారు. ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించి మొక్కలను సంరక్షించుకోవాలన్నారు. జెడ్‌పి చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గం పూర్తిగా వర్షాభావ పరిస్థితులపై పంటలు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. అక్కడ ఎటువంటి పంటలు వేస్తే రైతుకు లబ్ధి చేకూరుతుందని ప్రశ్నించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ డిఆర్‌డిఎ ద్వారా జిల్లాలో 30 మండలాల్లో ఉన్న సంఘాల వివరాలు తెలియజేస్తూ వారికి మంజూరు చేస్తున్న బ్యాంకు రుణాలు తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రభుత్వ పథకాలు మహిళలకు చిన్నచిన్న యూనిట్లకు సహకరించి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశాల్లో జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, డెప్యూటీ సిఇఒ వెంకటరామన్, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

కలిసికట్టుగా అభివృద్ధి చేద్దాం

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- హిరమండలం

అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తూలుగు మేనక అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాజకీయలకతీతంగా అందరం కలసికట్టుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు, సమస్యలకు ప్రభుత్వం తరుపున సమాధానాలు చెబుతూ భరోసా ఇచ్చారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో నిలిచిన పనులపై శాఖల వారీగా ప్రణాళికలు సిద్ధం చేస్తే దశలవారిగా అభివృద్ధి చేస్తామని అన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు, పారిశుధ్యంపై దృష్టిసారించాలన్నారు. మండలంలోని రోడ్లను నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పొగిరి బుచ్చిబాబు, ఎంపిడిఒ స్వరూపరాణి, డిటి డి.వెంకటరమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కూటమిపై త్వరలోనే తిరుగుబాటు

ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

టిడిపి కూటమి ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటు ఎంతో దూరంలో లేదని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవణితో కలిసి ఆమె ఛాంబర్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలతో ప్రజల్లో ఆశలు కలిగించి అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఇచ్చిన హామీలను సకాలంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పేదలకు చేసిన మేలు ఏ ప్రభుత్వమూ చేయలేదని అన్నారు. నాడు-నేడుతో విద్యావ్యవస్థలను అభివృద్ధి చేసిన ఏకైక నాయకులు జగన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తూ గత ప్రభుత్వంపై నిందలు వేసే కార్యక్రమాలు చేపడుతున్నారని, దీనిని ప్రజలు ఇప్పుడు గమనిస్తున్నారని అన్నారు. టిడిపి ప్రభుత్వ పరిపాలన ఇలాగే కొనసాగితే ప్రజలు రోడ్లపైకి వచ్చి నిలదీస్తారని హెచ్చరించారు. శాంతి భద్రతల విషయంలో విఫలమైందని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల్లో వైసిపి అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసిపి నాయకులు గూడ ఈశ్వరరావు, దున్న బాలరాజు, కంచిలి జెడ్‌పిటిసి ఇప్పిలి కృష్ణారావు, కె.శ్రీను, జోగారావు, టి.శాంతారావు పాల్గొన్నారు.

టెక్కలిలో ట్రాఫిక్ ఇబ్బందులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ట్రాఫిక్ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఎప్పటికప్పుడు... ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతూ సమస్యగా మారుతుంది. అందులో భాగంగా నిత్యం ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో ప్రయివేటు వాహనాలు రోడుపై నిలబెట్టిడంతో అటుగా తిరిగే మిగతా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇందిరాగాంధీ కూడలి నుంచి పాతబస్టాండ్ వరకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై, రోడ్డుపై షాపులు పెట్టడంతో ట్రాఫిక్‌కు మరింత అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

నిలిచిన వాహనాలు

అరసవల్లిలో రెండో మాస్టర్‌ప్లాన్ అమలు

- ఇంద్రపుష్కరిణి పనులకు రీటెండరు
- 16 రకాల వస్తువులు కొనుగోలుకు టెండరు
- స్థాయికితగ్గ ఉద్యోగుల సంఖ్య పెంపునకు చర్యలు
- దేవస్థానం ఇఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వివిధ రాష్ట్రాల నుంచి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికులు వస్తుంటారని, వారికి అవసరమైన మౌలిక వసతులను సమకూర్చేందుకు వీలుగా రెండో మాస్టరు ప్లాన్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వ అనుమతి కోరినట్లు ఆలయ ఇఒ, దేవాదాయ, ధర్మాదాయశాఖ డెప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ వెల్లడించారు. ఇప్పటి వరకు మాస్టర్ ప్లాన్-1 అమలులో ఉన్నా... గత ఐదేళ్ల కాలంలో ప్లాన్‌కు అనుగుణంగా పనులు చేపట్ట లేకపోయామని అన్నారు. ఇప్పుడు రెండో మాస్టర్‌ప్లాన్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. ఆలయానికి ఏటా రూ.12 కోట్లకు మించి ఆదాయం సమకూరుతోందని చెప్పారు. ఆలయంలో మరిన్ని మౌలిక వసతులు సమకూర్చుకునేందుకు వీలుందన్నారు. అందులో బాగంగా మాస్టర్ ప్లాన్-2 అనుసరించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? అభివృద్ధికి ప్రణాళికలు ఏమిటి?

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి పెద్దమొత్తంలో ఆదాయ వనరులు ఉన్నాయి. ఆలయానికి దేశ వ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాలే కాకుండా ఉత్తరాధి నుంచి యాత్రికులు వచ్చి సందర్శించుకుంటున్నారు. అయితే ఆలయానికి సంబంధించి మౌలిక వసతులు సమకూర్చేందుకు అనువైన పరిస్థితి ఇప్పటి వరకు లేకుండా ఉంది. ఏడాది ఫిబ్రవరిలో ఆలయం స్థాయిని దేవాదాయ ధర్మాదాయశాఖ పెంచింది. గతంలో సహాయక కమిషనర్ స్థాయి అధికారి కార్యనిర్వహక బాధ్యతల్లో కొనసాగేవారు. అప్పట్లో ఆదాయం రూ.5 కోట్లు మించి సమకూరేది. 2018-19లో రూ.5.48 కోట్లు ఆదాయం సమకూరింది.

? ఉద్యోగులు ఎంతమంది పనిచేస్తున్నారు?

అరసవల్లి దేవస్థానం నిర్వహణ అవసరాల కోసం కార్యనిర్వహణాధికారితో పాటు ఇద్దరు సూపరింటెండెంట్లు, ఇద్దరు సీనియర్, ముగ్గురు జూనియర్ సహాయకులు, ముగ్గురు రికార్డు అసిస్టెంట్లు, ఎలక్ట్రీషియన్, నలుగురు అటెండర్లు, నలుగురు స్వీపర్లు మంజూరై ఉన్నాయి. వాస్తవానికి ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఇద్దరు అటెండర్లు మాత్రమే ఇప్పుడు పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. వీరితో పాటు ఐదుగురు అర్చకులు, పరిచారిక, పచిక, ఒక్కొరు, నలుగురు వేదపారాయణదారు, కుక్, ఐదుగురు భజంత్రీలు, సబ్ టెంపుల్‌కు, అవుట్ సోర్సింగ్, నైట్ వాచ్‌మెన్ కలుపుకుని మరో 29 పోస్టులు మంజూరై ఉన్నాయి. వీటిలో అర్చకులు, మినహా మిగిలిన పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అవుట్ సోర్సింగ్ ద్వారా ప్రస్తుతం 48 మంది విధుల్లో ఉన్నా... వారికి కమిషనర్ నుంచి అనుమతి లేకపోవడంతో జీతభత్యాలు నాలుగు నెలలుగా చెల్లించలేక పోతున్నాం.

? ఇంద్రపుష్కరిణి మరమ్మతు పనులు ఏ దశలో ఉన్నాయి?

ఆలయానికి ఎదురుగా విశాలమైన ఇంద్రపురణి ఉంది. స్వామివారికి చిలుకుల ద్వాదశి పర్వదినాన తెప్పోత్సవాన్ని ఇక్కడే కన్నుల పండువగా నిర్వహిస్తుంటాం. ఈ పుష్కరణి ప్రస్తుతం పునర్నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం అనుమతించింది. దేవాదాయశాఖ నుంచి రూ.4కోట్ల నిధులతో ఈ పుష్కరణి పునర్నిర్మాణం జరగాల్సి ఉంది. ఇప్పటికే టెండర్లు పూర్తయ్యాయి. పనులు ప్రారంభించడంలో గడచిన ఐదు నెలలుగా సంబంధిత కాంట్రాక్టరు జాప్యం చేస్తున్నారు. పనులు వర్షాకాలం పూర్తయిన వెంటనే చేపట్టాల్సి ఉంటుంది. అందువల్ల కాంట్రాక్టరు పనులు ప్రారంభించడానికి సుముఖంగా లేరని తెలుస్తోంది. ఈ టెండరును రద్దు చేసి రీటెండరుకు వెళ్లాలని భావిస్తున్నాం. కమిషనర్ అనుమతితో రీటెండరు నిర్వహించనున్నాం.

? ప్రసాదాల తయారీ, సరకుల కొనుగోలులో ఎలాంటి మార్పులు తీసుకురానున్నారు?

ప్రసాదాల తయారీ, నిత్యాన్నదాన పథకం నిర్వహణ ఆలయం ఆధ్వర్యాన నిర్వహిస్తున్నాం. కాంట్రాక్టరు విధానం ఇక్కడ అమలులో లేదు. అందువల్ల వీటికి అవసరమైన సరుకులతో పాటు ఆలయంలో ఏడాది పొడవున పువ్వులు, ఆయిల్, ఇతర సామగ్రి కొనుగోలు నేరుగా ఆలయ అధికారులు కొనుగోలు చేసేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితికి స్వస్తిపలికి 16 రకాల వస్తువులను సేకరించేందుకు టెండరు ప్రక్రియ నిర్వహించనున్నాం. వాటితో పాటు ఆలయం ఎదురుగా ఉన్న దుకాణ సముదాయాన్ని వేలం ద్వారా కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నేరుగా కేటాయించే ప్రక్రియకు స్వస్తిచెపుతాం. అలాగే తలనీలాలు, కొబ్బరి వేలం ఏటా కొనసాగుతోంది. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం.

? ఆలయంలో ఇతర కట్టడాలకు ప్రతిపాదనలు ఉన్నాయా?

ఆలయానికి ఎదురుగా టిడిపి సత్రం ఉంది. ప్రస్తుతం అది వినియోగంలోలేక పోవడంతో ఈ భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదన పంపించాం. అలాగే ఆలయానికి ఎదురుగా ప్రయివేటు నివాస గృహాలు, ఇతర కట్టడాలు ఉన్నాయి. వాటి వల్ల ఆలయ అవసరాలకు తగినంత విశాలప్రాంగణం లేదు. అయితే దేవాలయానికి పూర్వీకులు దానమిచ్చిన ఆస్తులు ఉన్నాయి. వాటి విలువ ఇప్పుడు రూ.కోట్లలో ఉంది. ప్రత్యామ్నాయంగా ఆయా కుటుంబాలతో సంప్రదించి వారికి భూమిని కేటాయించి అక్కడున్న స్థలాలను స్వాధీనం పరచుకునేందుకు ఉన్నత స్థాయిలో చర్చ ఉంది. త్వరలో దీనికి పరిష్కారం లభిస్తుంది.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE, ICHAPURAM
IA.86/2024 in OS.28/2024

Between
Jeevaratna Das ....Plaintiff
And
Konderpu Kesavanarayana @ Santosh ....Defendant

To
Konderpu Kesavanarayana @ Santosh,
s/o Kameswara Rao, occupation by Welder.
r/o Door No.3-168, Thoturu Village,
Post - MANDAPALLI, Mandalam - Ichapuram,
District - Srikakulam, Andhra Pradesh.

NOTICE IN IA.86/2024 IN OS.28/2024

Please take notice that the above named plaintiff filed the above suit in OS.28/2024 along with an IA.86/2024 for attachment before judgement of the suit schedule property before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram against you for recovery of suit amount and the matter is posted to **09-08-2024** for your appearance before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram at **10.30 AM.** on the said date in person or through your counsel or else the matter will be decided in your absence.

R.Devaraj Reddy
Advocate, Ichapuram,
Srikakulam Dist.

ర్యాలీ నిర్వహిస్తున్న క్రీడాకారులు

ఒలింపిక్ ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఫ్రాన్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ఒలింపిక్ క్రీడల్లో పాల్గొన్న భారతీయ క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు ఆదివారం నగరంలో క్రీడాకారులు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఏడురోడ్ల కూడలి నుంచి కోడి రామ్మూర్తి స్టేడియం వరకు సాగిన ఒలింపిక్ ర్యాలీలో పెద్దసంఖ్యలో క్రీడాకారులు హాజరై సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌డిఒ శ్రీధర్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, టూరిజం అధికారి నారాయణరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న హరికాప్రసాద్

విద్యకు పేదరికం అడ్డుకారాదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చదువుకునేందుకు పేదరికం అడ్డు కాదరాదని, విద్యార్థుల్లో మానసిక స్థైర్యాన్ని నింపేందుకు తనవంతు సాయం అందిస్తానని లయన్స్‌క్లబ్ హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హరికా ప్రసాద్ అన్నారు. ఆదివారం పిఎస్ఎన్ఎం స్కూల్‌లో పదోతరగతి చదువుతున్న మణిచరణ్, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న బోగిల జోషితకు ఫీజులు, పుస్తకాల కోసం ఆయన ఆర్థికసాయం అందజేశారు. వారి తల్లి అభ్యర్థన మేరకు తనవంతు సాయం అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్వాతి

రక్తదాన శిబిరానికి స్పందన

శ్రీకాకుళం అర్బన్: ప్రతిఒక్కరూ రక్తదానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో జెంటి, ఆదిత్య వాకర్స్ సంయుక్తంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఆమె హాజరై ప్రారంభించారు. పెరుగుతున్న రక్తం అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలన్నారు. వాకర్స్, జెంటి విద్యార్థులు రక్తదానం చేసేందుకు ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. డిఎపిఆర్‌ఒ చెన్నకేశవరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, ఆదిత్య వాకర్స్ గవర్నర్ కొంక్యాణ మురళీధర్, శాస్త్రు జోగి నాయుడు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 107 మంది రక్తదానం చేశారు.

వెంకట రాజారావును సన్మానిస్తున్న చంద్రశేఖరరావు

'లేత చేతులకు ఊతం' కవితకు ప్రశంస

ఆమదాలవలస: పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావుకు మరో పురస్కారం లభించింది. 'లేత చేతులకు ఊతం' అనే కవితకు ఆదివారం కాకినాడకు చెందిన సాహిత్య సాంస్కృతిక సంస్థ రాజారావు ఇటీవల సాధించిన అనేక అవార్డులు, బహుమతుల నేపథ్యంలో ఆయన సాహిత్య సేవను గుర్తించి ఘనంగా సత్కరించి పురస్కారాన్ని అందజేసింది. పిఆర్‌జి బాలికోన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు దాడి చంద్రశేఖరరావు ఈ పురస్కారాన్ని రాజారావుకు అందజేశారు. రాజా రావుకు పురస్కారం రావడంపై పట్టణంలోని ప్రముఖులు, సాహితీ అభిమానులు, కళాకారులు అభినందించారు.

లోకేష్‌ను కలిసిన రాము

రణస్థలం: మంత్రి నారా లోకేష్‌ను రణస్థలం మండల కేంద్రానికి చెందిన విజయనగరం పార్లమెంట్ రజక సాధికారిక కన్వీనర్ గురజాపు రాము అమరావతి లోకేష్ కార్యాలయంలో కలిసినట్లు ఆదివారం స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. అలాగే రజకులు 90 శాతం టిడిపితోనే పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారని చెప్పారు. రజకులకు ఎస్‌సి రిజర్వేషన్ కల్పించాలని కోరినట్టు తెలిపారు.

న్యాయం జరిగేనా?

కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న సతీష్‌బాబు బాధితులు

ప్రజాశక్తి- కవిటి

జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న పంచాయతీ కార్యదర్శి మన్యం సతీష్‌బాబు సాగించిన ఆర్థిక అక్రమాలు రోజురోజుకూ పదుల సంఖ్యలో వెలుగులోకి వస్తున్నాయి. పెళ్లి కోసం ఉంచిన డబ్బులు, సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు దాచుకున్న సొత్తు, మూరెడు, సేరెడు ఉన్న భూమి కూడా అమ్మి ఉద్యోగం కోసం సతీష్‌బాబు చేతిలో పోసామని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. అయితే ఇంత జరుగుతున్నా ఇదేది తన వ్యవహారం కాదన్నట్టు, తనకేం సంబంధం లేదన్నట్టు సతీష్‌బాబు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. సతీష్‌బాబుకు సంబంధం లేకుంటే జిల్లా నలుమూలల నుంచి బాధితులు అతనిపై ఫిర్యాదు చేస్తున్నారా? సతీష్‌బాబుతో ఎటువంటి బంధుత్వం కానీ, స్నేహం కానీ లేని బాధితులు జిల్లాలో ఇంతమంది ఉద్యోగులు ఉండగా కేవలం సతీష్‌బాబుపైనే ఎందుకు ఫిర్యాదు చేస్తున్నారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు వేధిస్తున్నాయి. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి తమను మోసం చేశాడని డిపిఒకి కొంతమంది బాధితులు చేసిన ఫిర్యాదుతో జులై 20న మండల ఎంపిడిఒ తన కార్యాలయంలో సతీష్‌బాబు, బాధితులను విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఆ తర్వాత మరికొంత మంది బాధితులు నేరుగా కలెక్టర్ మీకోసంలో ఫిర్యాదు చేయడంతో మొన్న శుక్రవారం జెడ్‌పి సిఇఒ ఆధ్వర్యాన బాధితులు, కార్యదర్శి సతీష్‌బాబుని విచారించారు. ఈ విచారణకు జిల్లా వ్యాప్తంగా మరికొంతమంది హాజరైనా కేవలం మీకోసంలో ఫిర్యాదు చేసిన వారి వివరణ మాత్రమే తీసుకుని కలెక్టర్‌కు నివేదించారు. అదే సమయంలో తాము మోసపోయామని కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తమకు న్యాయం చేయాలని బాధితులు అక్కడున్న అధికారులను వేడుకున్నారు. ఇదంతా చూస్తున్న కార్యదర్శి సతీష్‌బాబు మాత్రం ఏ మాత్రం అదురూ, బెదురూ లేకుండా చిరునవ్వుతో ఆ ప్రాంగణంలో తిరగడం బాధితులు జీర్ణించుకోలేక పోయారు. ఇంతమంది బాధితులను ఎదురుగా పెట్టుకుని ఇన్ని మోసాలు చేసి సతీష్‌బాబు ఎలా ధైర్యంగా తిరుగుతున్నాడని వారు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారుల చేతిలోనే తమ న్యాయం దాగుందని, బడుగు బలహీన తరగతులకు చెందిన తమకు న్యాయం చేసి తమ డబ్బు తమకు ఇప్పించాలని వారు వేడుకుంటున్నారు. ఇటువంటి అక్రమాలు జరగకుండా భవిష్యత్‌లో కఠిన చర్యలు తీసుకోవాలని, తమలా మరిన్ని కుటుంబాలు అన్యాయానికి గురికాకుండా చూడాలని వారు కోరుతున్నారు.

తప్పు చేసేందుకు భయపడాలి

సతీష్‌బాబు చేసిన ఆర్థిక మోసాలతో జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో కుటుంబాలు నిర్వీర్యమైపోయాయి. అందులో నేను ఒకర్ని. స్వయానా సతీష్ బాబుకి తోడల్లుడిని. నా తల్లి చనిపోయిన దుఃఖంలో ఉండగా నన్ను మోసం చేశాడు. ఇంటికి దూరంగా విధులు నిర్వహిస్తున్న నన్ను స్వగ్రామానికి బదిలీ చేయిస్తానని మాయచేసి నావద్ద రూ.6 లక్షలు తీసుకున్నాడు. బదిలీ లేదు కదా డబ్బులు కూడా ఇవ్వడం లేదు. నా పరిస్థితే ఇలా ఉంటే మిగతా వారి పరిస్థితి మీరు ఊహించుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనికో ముగింపు పలకాలి. మోసపోయిన వారికి న్యాయం చేసి వారి డబ్బులు ఇప్పిస్తే వారి కుటుంబాలు నిలబెట్టినవారవుతారు.

- టింగ రాజబాబు, బాధితుడు, మంగువారితోట, శ్రీకాకుళం

సతీష్‌బాబుని విచారిస్తున్న అధికారులు (ఫైల్)

అప్పు చేసి డబ్బులు ఇచ్చాను

నిరుద్యోగినైన నేను అప్పుచేసి మరీ సతీష్ బాబుకు రూ.8 లక్షలు ఇచ్చాను. వాస్తవంగా డబ్బులు ఇవ్వడం తప్పే. అందరూ ఉద్యోగం ఇస్తామంటే మీరెలా డబ్బులు ఇచ్చారని అడుగుతున్నారు. సతీష్‌బాబు అనే వ్యక్తి నిరుద్యోగులను ప్రలోభాలకు గురిచేసి దోచుకోవడమే లక్ష్యంగా తిరుగుతున్నాడు. వాడివలలో చిక్కుకుని మేం మోసపోయాం. వందల మందిని మోసం చేసి కోట్లలో దోచుకుంటున్న సతీష్‌బాబు తీవ్రమైన ఆర్థిక నేరస్తుడు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేస్తే పదుల సంఖ్యల కుటుంబాల్లో వెలుగులు నింపిన వారవుతారు.

- పిల్లా నరేష్ కుమార్, బాధితుడు, శ్రీకాకుళం

ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

క్షతగాత్రునికి అండ

కవిటి: మండలంలోని శిలగాంకు చెందిన క్షతగాత్రుడు కాల తాతయ్యకు ఎమ్మెల్సీ నర్తు రామారావు అండగా నిలిచారు. నిర్మాణ పనుల్లో భాగంగా టైల్స్ బండి నుంచి టైల్స్ బయటకు తీస్తుండగా తాతయ్య మీదపై రెండు కాళ్లు విరిగిపోవడమే కాకుండా తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో రెక్కాడితే గానీ డొక్కాడని తాతయ్య కుటుంబం దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామారావు ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆదివారం తాతయ్యకు రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న టిడిపి నాయకులు

జవాన్‌కు నివాళి

నౌపడ: సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్రకు చెందిన డొక్కరి రాజేష్ ఇటీవల ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందారు. విషయం తెలుసుకున్న టిడిపి తెలుగు యువత జిల్లా అధ్యక్షులు దాసునాయుడు ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా రాజేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయనతో పాటు సర్పంచ్ అసినాయుడు ఉన్నారు.

నక్సల్‌బరి ఉద్యమ నేత 'మజుందార్'

పలాస: నక్సల్‌బరి ఉద్యమ అగ్రనేత చారు మజుందారని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు కొనియాడారు. మండలంలోని నీలావతిలో ఆదివారం చారు మజుందార్ 52వ వర్ధంతి సభ నిర్వహించారు. భారత కార్మిక సంఘాల సమైక్య జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి అధ్యక్షతన సభ నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రాకు హోదా సాధించు కోవడంలో కేంద్రంతో తలపడాల్సిన బాధ్యత సిఎం చంద్రబాబుపై ఉందన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా అధ్యక్షులు సోర్ర రామారావు, ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వంకల పాపయ్య, సవర బంగ్లా కుమార్, పిఒ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు బదకల ఈశ్వరమ్మ, మురిపింటి తాతారావు, రాపాక చంద్రయ్య, కోదండరావు భూపతి పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు సరఫరా చేయాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

నియోజకవర్గంలో ప్రతి రైతుకు ప్రభుత్వం ఖరీఫ్ సాగుకు అందించే ఎరువులు సకాలంలో సరఫరా చేయాలని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని చిన్నపాలెంలో రవికుమార్‌ను టిడిపి నాయకులు గజ్జన చంటి, నాగం రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సన్మానించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన రైతులు తమ గ్రామాలకు ఇంకా ఎరువులు సరఫరా చేయలేదని, నాట్లు వేసిన 45 రోజుల్లో ఎరువులు అందించాల్సి ఉన్నప్పటికీ ఇప్పటివరకు యూరియా, డిఎపి అందలేదని రైతులు ఎమ్మెల్యేకు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయాధికారి బి. పద్మనాభంతో ఫోన్‌లో మాట్లాడుతూ రైతులకు అవసరమైనప్పుడు ఎరువులు అందించకుండా నిర్లక్ష్యం వహించడం ఏమిటని, నాలుగు మండలాల్లో ప్రతి రైతుకు సకాలంలో ఎరువులు అందించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందని, నిర్లక్ష్యం వహిస్తే సహించనని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో మండలస్థాయి అధికారుల బదిలీల అనంతరం మండల కార్యాలయాలు, గ్రామాలను సందర్శించి ప్రతి సమస్యపై ప్రజలతో చర్చించి అనంతరం పూర్తిస్థాయి అభివృద్ధి చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, అంబళ్ల రాంబాబు, పల్లి సురేష్ కిల్లి సిద్ధార్థ, లావేటి పూర్ణారావు, తాడేల వెంకటరమణ, తాడేల రాజారావు, ఎన్.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

రవికుమార్‌ను సన్మానిస్తున్న చిన్నపాలెం గ్రామస్తులు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

ఇంటింటికీ తాగునీరు

నరసన్నపేట: ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో మేజర్ పంచాయతీ సత్యవరంలో మంచినీటి పున్హసరఫరాను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార దర్శకమైన పాలన అందించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గ్రామాల్లో స్వపరిపాలన అందించేందుకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తా మన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం అప్పుల పాలై పోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కనీస అవసరాలైన సాగునీరు, తాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ సందర్భంగా సత్యవరం గ్రామానికి తాగునీరు అందించే పైపులైనుకు భూములిచ్చి సహకరించిన ధర్మాన రామారావు, ధర్మాన సూర్యనారాయణను ఎమ్మెల్యే సన్మానించారు. టిడిపి రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, వెంకటరావు, రోణంకి కృష్ణన్నాయుడు, కృష్ణ పాల్గొన్నారు.

అధికారులు ప్రోటోకాల్ పాటించాలి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అధికారులు ప్రోటోకాల్ పాటించాలని ఎమ్మెల్యే నర్తు రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఉప్పరపెల్లి నీలవేణి అధ్యక్షతన ఆదివారం మండల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైసిపి అధికారం ఉన్నప్పుడు అర్హులందరికీ నేరుగా సంక్షేమ అందించామని తెలిపారు. సిఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పథకాలను తుచ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల పరిషత్‌లో తీర్మానం చేయాలని సర్పంచ్‌లు అట్టాడ గోవిందరావు, అంబటి శ్రీను, చింత రాజు కోరారు. గ్రామాల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యమవుతుందా అని అధికారులను ఎంపిపి నిలదీశారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రతి సర్పంచ్, ఎంపిటిసిని కలుపుకొని అభివృద్ధి వైపు సాగాలని హితవుపలికారు. విద్యుత్‌శాఖ ఎఇ పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మత్స్యకార భరోసా ఇంతవరకు అందలేదని, అసలు వస్తుందా? లేదా? అని మత్స్యశాఖాధికారి ధర్మరాజు పాత్రోను సభ్యులు నిలదీశారు. ఇంతవరకు తమకు ప్రభుత్వం ఎటువంటి గైలెన్స్ రాలేదని ఆయన సమాధానం ఇచ్చారు. మత్స్యకార సొసైటీ ఎన్నికలకు సంబంధించి చాలామంది పేర్లు తొలగించారని, దీనిపై సమాధానం చెప్పాలని కె.ఆర్.పేట సర్పంచ్ వంక చిరంజీవి నిలదీశారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, వైస్ ఎంపిపి వంకరాజు తమ్మినేని శ్రావణి, ఎంపిడిఒ తిరుమలరావు, తహశీల్దార్ గిరిరాజు, సర్పంచ్‌లు దువ్వాడ మధుకేశ్వరరావు, దున్న బాలరాజు, గీతారాణి, ధర్మారావు, గూడ గిరిజ, కొల్లి భాస్కరరావు పాల్గొన్నారు.

సీజ్ చేసిన లారీలు

ఆగని ఇసుక దందా

మూడు లారీలు, ట్రాక్టర్, జెసిబి సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని నాగవళి నది పరివాహక ప్రాంతంలో కొంతమంది అక్రమార్కుల ఇసుక దందా మాత్రం ఆగడం లేదు. గడచిన కొన్నేళ్ల నుంచి రాత్రి వేళల్లో ఎటువంటి అనుమతులు లేకుండా నదిలో యంత్రాలు దించి ట్రాక్టర్లకు, లారీలకు ఇసుక ఎత్తి వ్యాపారాలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. అదే మాదిరిగా శనివారం అర్ధరాత్రి సమయంలో మండలంలోని సేపేనపేట, నిమ్మతొర్లాడ గ్రామాల మధ్య వంశధార నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగు తున్నాయి. శనివారం అర్ధరాత్రి ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. హెచ్‌సి లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా అదే ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ ఇసుక లోడుతో దొరకగా, మరో మూడు లారీలు, జెసిబిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్న జెసిబితో పాటు రవాణా చేసే వాహనాలను కూడా సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.జె.ఎస్ ప్రతాప్, శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇవ్వబడునని, వచ్చిన వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తీసుకు రావాలని కోరారు. ఆపరేషన్ అవసరమైన వారికి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ వారు ఉచితంగా ఆపరేషన్ నిర్వహిస్తారని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించు కోవాలని ప్రతాప్ కోరారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం మున్సిపాలిటీ మండలం పరిధిలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం పరామర్శించారు. అమరావతిలో అసెంబ్లీ సమావేశాలు ముగిసిన వెంటనే బాధిత కుటుంబాలకు స్వయంగా కలిశారు. టిడిపి నాయకులు తిప్పన రమణ కుమారుడు జ్వరంతో, సత్యసాయి విద్యా సంస్థల కరస్పాండెంట్ సాహుకరి కృష్ణమూర్తి గుండెపోటుతో మృతి చెందారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు ఆశి చిరంజీవులురెడ్డి, కాళ్ల జయదేవ్, నందిక జాని, పత్రి తవితయ్య, కాళ్ల దిలీప్‌కుమార్, లీలారాణి పాల్గొన్నారు.

పాతపట్నం: మండలం కొయ్యికొండకు చెందిన చిగుళ్ల కృష్ణమోహన్ ఇటీవలే అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న మాజీ రాష్ట్ర తూర్పుకాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్ ఆదివారం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు ఉన్నారు.

చెక్కును అందజేస్తున్న రామరాజు

అన్నదానానికి ఆర్థికసాయం

పాతపట్నం : పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు రూ.18 వేలు ఆర్థికసాయం అందజేశారు. టెక్కలి సత్యసాయి నిత్యన్నదానికి సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షులు రఘుపాత్రుని లక్ష్మణరావుకు ఆదివారం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌ఛార్జి బోయిన నరసింహమూర్తి, జిల్లా అధ్యక్షులు సూర రామచంద్రరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మొక్కను నాటుతున్న షణ్ముఖరావు

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఇచ్ఛాపురం: ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం వల్ల పర్యావరణ కాలుష్యం నుంచి పరిరక్షించుకోవచ్చునని జెసిఐ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు షణ్ముఖరావు అన్నారు. జెసిఐ 75 వసంత ఉత్సవాలు సందర్భంగా పట్టణంలోని కెజిబివిలో ఆదివారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని కాపాడి, కాలష్యాన్ని తగ్గించి మానవ మనుగడకి మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎం.నవీన్, ఢిల్లేసు, స్వరూప్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: మానవాళి మనుగడకు పచ్చని చెట్టు ఎంతగానో ఉపకరిస్తుందని, అందువలన ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి అన్నారు. ఆదివారం లయన్స్ క్లబ్ హర్షవల్లి ఆధ్వర్యాన కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో హరికా ప్రసాద్, అప్పలనాయుడు, జగన్నాథం నాయుడు, డాక్టర్ కృష్ణమోహన్, కరణం హారిక పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఇచ్ఛాపురం : మండలంలోని తిప్పనపుట్టుగ గ్రామం పేద కుటుంబానికి చెందిన కిడ్నీ బాధితులు అనురాధ బిసాయికి కేశుపురానికి చెందిన కాళీమాత సేవా సమితి దాతృత్వం చాటుకుంది. కిడ్నీ వ్యాధితో చాలా రోజులుగా బాధపడుతున్న విషయం తెలుసుకున్న సేవా సమితి సభ్యులు స్పందించారు. స్వగ్రామానికి బాధిత కుటుంబానికి ఆదివారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. సభ్యులు భీమరాజు, మన్మథరావు, నరేంద్ర, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

టెక్కలి: గత ప్రభుత్వం హయాంలో దళితులపై జరిగిన దాడులపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సమతాసైనిక్ దళ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చల్లా రామారావు, ఎల్.సత్యన్నారాయణలు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ కూడలి వద్ద వద్ద ఆదివారం ఆందోళన చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రద్దు చేసిన దళిత సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మెడికల్ సీట్లు భర్తీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల చాలా మంది దళిత విద్యార్థులకు డాక్టర్ చదువులకు దూరమయ్యారని అన్నారు. అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ నాయకులు పందిరి లోకేష్, బిడియం నాగేశ్వరరావు, తుంగాన శంకరరావు, అక్కురాడ మాదవరావు, హేమసుందర్, పాపారావు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

పలాస: సెప్టెంబరు 8న జరగనున్న ప్రగతిశీల కార్మిక సమాఖ్య రెండో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన కోరారు. మండలంలోని బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల, శ్రామికుల, రైతు, మహిళల బ్రతుకులను విధ్వంసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. 44 చట్టాలను రద్దు చేస్తూ దాని స్థానంలో 4 లేబర్ కోడ్ లను తెచ్చి రైతు హక్కులను కార్పొరేట్ సంస్థలకు సహజ వనరులను, ప్రభుత్వ ఆస్తులను, అడవులను అప్పనంగా అప్పగిస్తూ దేశ సంపదపై ప్రజలకు హక్కు లేకుండా చేస్తున్న ప్రభుత్వాలు పై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు దేవాడ .నారాయణ మూర్తి, కారి పురుషోత్తం, మద్దిల ధర్మరావు, తామాడ త్రిలోచన పాల్గొన్నారు.

'సీడ్ టు సీడ్ కాంపాక్ట్ బ్లాక్'లో వరిసాగు

ఆముదాలవలస: మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో కాంపాక్ట్ బ్లాక్‌లో వరిసాగును చేస్తున్నారు. ఆదివారం ఎల్‌టు డిజిటల్ సురేష్ మాట్లాడుతూ డిపిఎం రేవతి ఆదేశాల మేరకు విత్తనం వేసినప్పటి నుంచి మరలా పంట చివర దశ వరకు ఈ కాంపాక్ట్ బ్లాక్‌లో ఉన్న రైతుల పంట పొలాల్లో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా సీడ్‌టుసీడ్ కంపాక్ట్ బ్లాక్‌లో పూర్తిగా లైన్ షోయింగ్ పద్ధతిలో వరి పంట వేసుకోవడం, గట్లపై బహుళ పంటలైన కూరగాయలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ విధంగా గ్రామాల్లో కాంపాక్ట్ బ్లాక్‌లను క్షేత్రస్థాయిలో రైతులతో చేయిస్తున్నామన్నారు. ఆదివారం చేపేనపేట, నిమ్మతొర్లువాడ గ్రామాల్లో పది ఎకరాల విస్తీర్ణంలో లైన్ షోయింగ్ వేయించామన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే జాతి జాగృతి

శ్రీకాకుళం అర్బన్: ఐకమత్యంతోనే జాతి జాగృతి పెరుగుతుందని, చాత్తాద వైష్ణవ సామాజిక తరగతి ప్రజలందరూ ఐకమత్యంతో మెలగాలని ప్రముఖ సినీనిర్మాత కంచర్ల అప్పారావు ఆకాంక్షించారు. నగరంలోని చిన్న బజార్ రోడ్‌లో వాసవి కళ్యాణ మండపంలో వైష్ణవ సంఘ జిల్లా, పట్టణ సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చాత్తాద శ్రీ వైష్ణవుల జనాభా 30 వేల మంది మాత్రమే ఉన్నట్టు ప్రభుత్వాలు చెబుతున్నాయన్నారు. గత 30 ఏళ్ల లెక్కలను ఇప్పటి వరకు చూపుతూ తమ సామాజిక తరగతిని వెనక్కి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ సామాజిక తరగతికి చెందిన ప్రజలు మూడు లక్షల మందికిపైగానే ఉన్నారన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి మాట్లాడుతూ చాత్తాద శ్రీ వైష్ణవులు ఎల్లప్పుడూ ఆధ్యాత్మిక భావంతో మెలుగుతారన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులుగా ఆలవెల్లి తిరుమలేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శోభన్ బాబుతో పాటు మరో 22 మందితో కూడిన కార్యవర్గం, అలాగే పట్టణ అధ్యక్షులుగా తాళ్లూరి నవీన్, ప్రధాన కార్యదర్శిగా కోవెలకొండ కుమార్‌తో పాటు మరో ఏడుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కొర్ను నాగార్జున ప్రతాప్, రెడ్డి గిరిజ శంకర్, బసవ నానితో పాటు చాత్తాద శ్రీ వైష్ణవ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ప్రతినిధులు

హెపటైటిస్‌పై అశ్రద్ధ వద్దు

నేడు ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రస్తుతం కాలంలో ఉన్న పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, జీవన విధానాలు, ఉద్యోగంలో ఒత్తిళ్లు, మానసిక ఒత్తిళ్లు, నిద్రలేనితనం తదితర కారణాలతో మనిషి ఎన్నో వ్యాధుల బారిన పడుతున్నారు. దేశ వ్యాప్తంగా ఏటా హెపటైటీస్ వ్యాధిగ్రస్థులు పెరిగిపోతున్నారన్నంటున్నారు మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు, కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ఆర్.ప్రశాంత్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. హెపటైటిస్ అనేది వైరస్‌ల వల్ల లివర్‌కు వచ్చే సమస్య అన్నారు. ఈ వైరస్‌లో ఐదు రకాలు ఉన్నాయన్నారు.

ఎ,బి,సి,డి,ఇ ఇవి ఎక్కువగా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంటాయని చెప్పారు. మొదట మానవ శరీరంలోకి ప్రవేశించగానే కాలేయానికి చేరుకుని ఇన్‌ఫెక్షన్‌ను కలిగిస్తాయన్నారు. ఈ హెపటైటిస్‌లో ఎ, ఇ అనేవి ఒకరి నుంచి ఒకరికి కలుషిత నీరు, కలుషిత ఆహారం ద్వారా సంక్రమిస్తుంటాయని తెలిపారు. సాధారణంగా ఇటువంటి హెపటైటిస్ ఇబ్బందులు ఉంటే కొన్నిరకాల లక్షణాలు కనిపిస్తుంటాయని అన్నారు. ఒళ్లు నొప్పులు, తేలికపాటి జ్వరం, తలనొప్పి, శరీర బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆ తర్వాత 2, 3 రోజుల్లో పచ్చకామెర్లు బయట పడతాయని తెలిపారు. ఇమ్యూనిటీ తక్కువ ఉన్నప్పుడు, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం హెపటైటిస్ ఎ,ఇ వైరస్‌ల కారణంగా కాలేయానికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడవచ్చునని అన్నారు. దీనిని ఫల్మనెంట్ హెపటైటిస్ అని పిలుస్తారని పేర్కొన్నారు.

ఇటువంటి సందర్భాల్లో రోగిని ఆస్పత్రిలో చేర్పించడం తప్పనిసరిని అన్నారు. రెండో రకమైన హెపటైటిస్ బి,సి రకాలను ప్రమాదకరమైనవిగా చెప్పొచ్చున్నారు. సాధారణంగా శరీర ద్రవాల (లాలాజలం, రక్తం) మూలంగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంటాయని పేర్కొన్నారు. ఇన్‌ఫెక్టెడ్ సిరంజీలు, నీడిల్స్ ద్వారా కూడా ఇవి వ్యాపించే ప్రమాద ముందని తెలిపారు. హెపటైటిస్ వైరస్ రాకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడం, కలుషిత నీరు, కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని పేర్కొన్నారు. రక్తదానం, మార్పిడి సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెపటైటిస్ బీ వైరస్ నుంచి రక్షణ పొందేందుకు టీకాలు కూడా లభిస్తున్నాయని తెలిపారు.

ఆర్.ప్రశాంత్, డాక్టర్